క్లుప్తంగా

ఇంటింటికి సర్వే



వెల్దండ: మండలంలోని కొట్ర, చొక్కన్నపల్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ అధికారులు రేషన్‌కార్డు దరఖాస్తుదారుల ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. ఆయా రేషన్‌షాపుల వారిగా లబ్ధిదారుల పేర్లను వివరించారు. కుటుంబంలోని అందరికి ఆధార్‌కార్డులు నమోదు చేసుకొని వివరాలను సేకరిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వం రేషన్‌కార్డులను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు శంకర్, సైలజ, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులు జంగయ్య, పుష్పగిరి, తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కల్వకుర్తి: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మునిసిపాలిటీ పరిధిలోని సంధ్యాపూర్ కు మంజూరైన డ్రిప్ పైపులను రైతులకు ఆయన అందజేశారు. రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. జంగయ్య, లక్ష్మయ్య, శ్రీను, ముత్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ను నియమించాలి



కోడేరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పర్మనెంట్ డాక్టర్‌ను నియమించాలని సీపీఎం నాయకులు గురువారం తహసీల్దార్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, రవిలు మాట్లాడుతూ పర్మనెంట్ డాక్టర్ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో శివయ్య, పర్వతాలు, లక్ష్మయ్య, ఎండీ యాహియా తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తాడూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం మండలంలోని గుట్టపల్లిని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. దీంతో గ్రామంలో అర్హులైన వారు ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. ఈమేరకు గురువారం ఎంపీడీఓ ఆంజనేయులుతోపాటు హౌసింగ్ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. కొలతల ప్రకారం ఇళ్లను నిర్మించాలని సూచించారు.

రాజ్యాంగ హక్కులను రక్షించుకుందాం

వెల్దండ: రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకుందామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బొల్లంపల్లి, చల్లపల్లి, బండోనిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు పుల్లయ్య, శేఖర్, శ్రీనివాస్‌యాదవ్, శంకర్‌నాయక్, ప్రసాద్, శంకరయ్య పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి 977 దరఖాస్తులు

లింగాల: నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రాజీవ్ యువ వికాసం పథకానికి మండలంలో నిరుద్యోగుల నుంచి 977 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎస్టీలు 382, ఎస్సీలు 163, బీసీలు 420, మైనార్టీలు 02, ఈబీసీ 09, క్రిస్టియన్ 01 చొప్పున దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు.

మట్టి తరలింపు ఆపాలి

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పల్లగుట్ట నుంచి నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మట్టి తరలింపును ఆపాలని గ్రామస్తులు గురువారం తహసీల్దార్ ఇబ్రహీంకు ఫిర్యాదు చేశారు. పల్లగుట్టపై అతి పురాతనమైన ఆంజనేయస్వామి ఆలయానికి ప్రమాదం పొంచి ఉందని వివరించారు. ఫిర్యాదు చేసిన వారిలో గిరిధర్ రెడ్డి, లక్ష్మయ్య, రాఘవేంద్ర గౌడ్ తదితరులు ఉన్నారు.

వాల్ పోస్టర్ విడుదల

తిమ్మాజిపేట: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 27 చలో వరంగల్ కార్యక్రమం చేపట్టినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. రవీంద్రనాథ్‌రెడ్డి, గోపిగౌడ్, రాందేవ్‌రెడ్డి, స్వామి, ప్రశాంత్, హుసేనీ, వెంకటేష్, శేఖర్, సైఫ్, బాలయ్య పాల్గొన్నారు.

నత్తనడకన ఇళ్ల నిర్మాణాలు

- ఒక్కరికి కూడా అందని మొదటి బిల్లు
- పట్టించుకోని అధికారులు

వెల్దండ: ఇళ్లు లేని పేదలకు ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మండలంలో పైలెట్ గ్రామాన్ని ఎంపిక చేసి పేదలను గుర్తించారు. అర్హులైన వారి స్థలాల్లో ముగ్గులు పోసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. మండలంలోని చెర్కూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా జిల్లా అధికారులు ఎంపిక చేశారు. గ్రామంలో మొత్తం 98 మంది లబ్ధిదారులు ఇళ్లకోసం దరఖాస్తులు చేసుకోవడంతో పూర్తి సర్వే చేసి అర్హులైన 24 మందిని మొదటి విడతలో గుర్తించారు. గతనెల 7వ తేదీన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెర్కూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. అధికారులు గ్రామాల్లో పూర్తిగా పర్యవేక్షణ చేసి ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఇప్పటి వరకు కేవలం 11మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం కొలతలు వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిగిలిన వారు నేటికి పనులను ప్రారంభించలేదు. కొలతల ప్రకారం ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని అధికారులు ఆదేశించారు. నిబంధనల ప్రకారం 15 రోజుల్లో బేస్‌మెంట్ లెవల్ పనులు పూర్తిచేసిన వారికి బిల్లులు ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటికీ అందలేదు.

అర్హత ఉన్న ఇళ్లు మంజూరు కాలేదు

ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న అర్హత ఉన్న ఇళ్లు మంజూరు కాలేదని అర్హులైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో అధికారులు ఆన్‌లైన్ నమోదులు తప్పులుగా చేయడంతో తమ పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం



చెర్కూర్‌లో గుంతలకు పరిమితమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

చేస్తున్నారు. అద్దె భవనాలు, రేకుల ఇళ్లలో ఉన్న పేర్లు నమోదు చేసిన వారి ఆర్‌సీసీ(స్లాబ్‌ఇంటి)లో ఉన్నట్లు కంప్యూటర్లు పేర్లు వచ్చినట్లు లబ్ధిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచనాల మేరకు గ్రామంలో కార్యదర్శితో పాటు అధికారులు సర్వే చేశారు. అద్దె భవనాల్లో ఉన్నవారు, స్థలం ఉన్నవారిని ఎంపిక చేసి దాదాపుగా 34 మందికి ప్రాధన్యత ఇచ్చి పేర్లను ఎంపిక చేశారు. ప్రస్తుతం ఎంపీడీఓ పరిశీలనలో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

విడతల వారికిగా రూ.5 లక్షలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అధికారులు తెలిపిన నమూనాలో నిర్మాణం చేపట్టిన వారికి మాత్రమే విడతల వారికి బిల్లులు అందిస్తామని అధికారులు వివరించారు. స్థలం ఉండి ఇళ్లు లేని వారు మొదటగా స్వంత ఖర్చుతో బేస్‌మెంట్ వరకు ఇళ్లు నిర్మాణం చేస్తే రూ.లక్ష అందించనున్నారు. అదే విధంగా ఇంటి నిర్మాణ గోడలను పూర్తి చేస్తే మరో రూ.లక్ష, ఇంటిపైకప్పు స్లాబ్‌వేస్తే రూ.2లక్షలు, ఇళ్లు పూర్తి నిర్మాణం చేస్తే పైనల్ బిల్లు రూ.లక్ష చొప్పున అందించనున్నారు.

వేగవంతం చేస్తాం



పైలెట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయిస్తాం. గ్రామంలో మొత్తం మొదటి విడతలో 24 లబ్ధిదారులను ఎంపిక చేశాం. ఇప్పటి వరకు 11 ఇళ్లకు పనులను ప్రారంభం చేసి నిర్మాణం చేయిస్తున్నాం. త్వరలోనే మిగిలిన వారితోను పనులను మొదలు పెట్టిస్తాం. ఇప్పటి వరకు బేస్‌మెంట్ వరకు చేయకపోవడంతో ఒక్కరికి కూడా బిల్లు అందించలేదు. ఏప్రిల్ నెల చివరి నాటికి పనులు ప్రారంభం చేయని వారి ఇళ్లను రద్దు చేస్తాం.

–సత్యపాల్‌రెడ్డి, ఎంపీడీఓ, వెల్దండ

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

అచ్చంపేట రూరల్: మండలంలోని సిద్ధాపూర్‌లో గురువారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న రకం వరి ధాన్యంకు ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ. 2320, అలాగే రూ. 500 బోనస్ ఇస్తామన్నారు. దొడ్డురకం వరి ధాన్యం రూ. 2300 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు తమ వరి పంటను కొనుగోలుకు తెచ్చే సమయంలో పట్టాదారు పాస్ బుక్కు, బ్యాంకు పాస్ బుక్కు, ఆధార్ కార్డు, జిరాక్స్ కాపీలు వ్యవసాయ విస్తరణ అధికారి జారీ చేసిన పంట ధ్రువీకరణ పత్రం తీసుకుని రావాలన్నారు. సీఈఓ ఎల్లయ్య, బుచ్చిరాములు, హుస్సేన్, ఆంజనేయులు, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మెన్‌పేట్‌లో..

బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేట్‌లో గురువారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ నర్సయ్యయాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, పీఏసీఎస్ సీఈఓ రాజవర్ధన్ రెడ్డి, నాయకులు అంతటి మల్లేష్, సుధాకర్‌గౌడ్, రాంప్రసాద్‌గౌడ్, ఏఈఓ చందన పాల్గొన్నారు.



సిద్ధాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి

తినిధులు, ఇతర నాయకులు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

అచ్చంపేట రూరల్: ప్రతి మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట ఎక్కువ వేసుకున్న గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు ఇబ్బంది ఉండదన్నారు. ఆర్. శ్రీనివాసులు, దేశ్యానాయక్, శంకర్‌నాయక్, నాగరాజు, నిర్మల, సైదులు, సయ్యద్, రాములు, శివకుమార్ పాల్గొన్నారు.

యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు



నాగర్‌కర్నూల్ క్రైం: యువత మాదకద్రవ్యాలకు బానిసలై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో గురువారం మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని, ఎవరైనా గంజాయి వాడడం లేదా అమ్మకాల సమాచారం తెలిస్తే డయల్ 100కు తెలపాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ అంజయ్య అధ్యాపకులు మదన్‌మోహన్, ఉమాదేవి, రామకృష్ణ, దశరథం, ఏఎస్ఐ వజ్రం, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, దేవేందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ చైతన్య సభను విజయవంతం చేద్దాం

కల్వకుర్తి రూరల్: బడ్జెట్‌లో బీసీలకు వాటా కల్పించాలని, స్థానిక సంస్థ ఎన్నికలు, ఉద్యోగాలలో 42 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాగర్‌కర్నూల్ పట్టణంలో నిర్వహించే బీసీ చైతన్య సభను విజయవంతం చేయాలని బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ నియోజకవర్గ కన్వీనర్ మేకల రాజేందర్ కోరారు. గురువారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం ఆవరణలో సభకు సంబంధించి కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ముఖ్య అతిథిగా తీన్మార్ మల్లన్న హాజరవుతారని పేర్కొన్నారు. సదానందం గౌడ్, దుర్గాప్రసాద్, రవి గౌడ్, మణికంఠ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల, తీర్నాంపల్లి, నార్లాపూర్, మొలచింతలపల్లి, ముక్కిడిగుండం, లచ్చనాయక్ తండా, కల్వకోలు, చెన్నపురావుపల్లి, గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొల్లాపూర్ ఏఈ ఉమేష్ గౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ కుడికిల్ల, నార్లాపూర్ సబ్ స్టేషన్, పరిధిలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనుండటంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు.

డిపో అభివృద్ధిలో భాగస్వాములవుదాం

కొల్లాపూర్: ఆర్టీసీ ఉద్యోగులు డిపో అభివృద్ధిలో భాగస్వాములవుదామని డిపో మేనేజర్ ఉమాశంకర్ కోరారు. గురువారం డిపో పరిధిలోని ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. మార్చి నెలలో ఉత్తమ కేఎంపీఎల్, ఈపీకే, అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన డ్రైవర్లు, కండక్టర్లకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులతో గౌరవంగా మెలగాలన్నారు. విధుల నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రత్నమ్మ, వెంకటేశ్వర్లు, నజీర్, రహీం, గౌసోద్దీన్ తదితరులు ఉన్నారు.

పంక్చర్ దుకాణంలో అగ్నిప్రమాదం

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు పంక్చర్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో ఉన్న పంక్చర్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. విద్యుత్ సరఫరాను నిలిపి మంటలు ఆర్పివేశారు.

వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవాలి



కొల్లాపూర్: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ సూచించారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు 15 రోజుల పాటు కళాశాలలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థుల చదువుకు ఇబ్బంది కాకుడదనే ఉద్దేశ్యంతో అధ్యాపకులందరూ కలిసి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



బిజినేపల్లి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పాలెంలో వాంటెడ్ హెల్పింగ్ హాండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరికిపై ఉందన్నారు. నాయకులు వెంకటస్వామి, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

నాగర్‌కర్నూల్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు బీసీ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని కాలనీవాసులు కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, బీసీ కాలనీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి మధు, పర్వతాలు, నాయకులు కృష్ణప్రసాద్, చందుహరికృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేద్దాం



చారకొండ: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరు పాటుపడతామని జీహెచ్‌ఎం భగవాన్ రెడ్డి కోరారు. గురువారం మండలంలోని గోకారం, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధి కూలీలు పని ప్రదేశంలో తమ పిల్లను చేర్పించాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు శారీరక దృఢత్వ సంబంధిత ఆటలు, ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యాబోధన ఉంటుందని వివరించారు. వారి వెంట ఉపాధ్యాయులు కమాలాకర్ రావు, అంజయ్య, రామకృష్ణ, రాంబిక్షం, ప్రసాద్, సుధాకర్, గోపాల్ వెంకటరమణ, ఆంజనేయులు, సత్తయ్య ఆయా గ్రామాల యువకులు తదితరులు ఉన్నారు.

వాటర్ షెడ్ యాత్ర విజయవంతం చేయండి

మన్ననూర్: ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో ఈ నెల 23న నిర్వహించే వాటర్ షెడ్ యాత్రను మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డీఆర్‌డీఏ రాజేశ్వరి సూచించారు. గురువారం మండలంలోని బీకే లక్ష్మాపూర్, బీకే తిరుమలాపూర్ గ్రామాలను సందర్శించారు. వాటర్ షెడ్ ప్రాముఖ్యత ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. వాటర్ షెడ్ నిర్వహణతో పర్యావరణం పరిరక్షించబడుతుందన్నారు. నీటి వనరుల లభ్యత కూడా పెరుగుతుందని తెలిపారు. పీడీ క్రాంతి, జేఈ కాశన్న, డీపీఎం లక్ష్మయ్య, ఏపీఎం నిరంజన్, ఏపీఓ రఘు పాల్గొన్నారు.



నిందితులను కఠినంగా శిక్షించాలి

కల్వకుర్తి రూరల్: నల్లగొండ జిల్లా బొక్క ముంతల పహాడ్ గ్రామానికి చెందిన దళిత యువతి మల్లీశ్వరి ఆత్మహత్యకు కారణమైన జాన్ రెడ్డిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం కల్వకుర్తి ఆర్డీఓ కార్యాలయంలో స్వేరోస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వేరోస్ నాయకుడు నగేష్ మాట్లాడుతూ కుల వివక్షతతో మల్లీశ్వరి మృతి చెందిందని ఆరోపించారు. మల్లీశ్వరి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామన్నారు. అనంతరం పట్టణంలోని మహబూబ్‌గర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో భీముడు, రాజన్న, కిషోర్, శివ, కిరణ్, విష్ణు, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని ఉరి తీయాలి

కొల్లాపూర్: యువతి మల్లీశ్వరి మృతికి కారణమైన జాన్‌రెడ్డిని ఉరితీయాలని తెలంగాణ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు శీలం వెంకటస్వామి, ఆటో రాముడు తదితరులు ఉన్నారు.

యువతి ఆత్మహత్య బాధాకరం

తెలకపల్లి: కుల వివక్షతో యువతి మల్లీశ్వరి ఆత్మహత్య చేసుకోవడం బాధకరమని స్వేరోస్ నాయకులు శివశంకర్ పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఆమెకు నివాళులర్పించారు.



తిమ్మాజిపేట మండలం మరికల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

కొవ్వొత్తులతో ర్యాలీ

తిమ్మాజిపేట: మండలంలోని మరికల్‌లో మల్లీశ్వరి ఆత్మ శాంతించాలని కోరుతూ గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. స్వేరోస్ జిల్లా నాయకులు విజయ్‌కుమార్, శంకర్, రామస్వామి, వెంకటయ్య, దశరథం, వెంకటస్వామి, బాలయ్య, శివ, వెంకటయ్య, రాములు, మల్లేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

ఉప్పునుంతల: ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని అచ్చంపేట ఆర్డీఓ మాధవి హెచ్చరించారు. గురువారం మండలంలోని కాంసానిపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన 32 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను ఆర్డీఓ పరిశీలించి సీజ్ చేశారు. అంతకుముందు అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు అక్రమ ఇసుక డంపును పరిశీలించారు. ఇసుకను సమీపంలోని చీకటి వాగు నుంచి తరలించి గ్రామంలో డంపు చేసినట్లు అధికారులు గుర్తించారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు ఇసుకను అక్రమంగా డంపు చేసిన గ్రామానికి చెందిన జితేందర్‌పై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. అధికారులు సీజ్ చేసిన ఇసుకను ఇతర ట్రాక్టర్లతో ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోకి తరలించారు. త్వరలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఈ ఇసుకను వినియోగిస్తామని తహసీల్దార్ ప్రమీల తెలిపారు.



ఇసుక డంపును పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి

ప్రభుత్వ ఆస్పత్రికి నిరంతర విద్యుత్ సౌకర్యం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి 24 గంటల విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నామని ఏడీఈ శంకరయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని పాత, కొత్త ఫీడర్ల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి విద్యుత్ సరఫరా అందే విధంగా పనులు పూర్తి చేశామన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాలతో రూ.10 లక్షల ఖర్చుతో ఆస్పత్రికి రెండు లైన్ల ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు పనులు పూర్తి చేశామన్నారు. ఏఈ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

22న అంబేడ్కర్ జాతర

తాడూరు: మండలంలోని యటిదారిపల్లి, నాగదేవ్‌పల్లి గ్రామాలలో గురువారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 22 నిర్వహించనున్న పూలే, అంబేడ్కర్ జాతరకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. వెంకటేష్, విజయ్, రవి, బాల్‌వెంకటయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ జాతర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 22న నాగర్‌కర్నూల్ పట్టణంలో సాయంత్రం 4 గంటలకు జాతర ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, గూట విజయ్, ప్రదీప్, జగన్‌రాజ్, గోపిగౌడ్, వెంకటేష్, బాలవెంకటయ్య, సురేందర్, స్వామి, బాలయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది

తెలకపల్లి: ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రాంచందర్ రావు, డీఈఓ కార్యాలయ అధికారి రాజశేఖర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసులు పదవీ విరమణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, అశోక్, ఆనంద్, సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ యాదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రఘుపతిపేట వాసికి ప్రెసిడెంట్ పోలీస్ మెడల్



కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేట గ్రామానికి చెందిన మెరుగు రవీందర్ రెడ్డి గురువారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ అందుకున్నారు. ఆయన సీఆర్పీఎఫ్ ఎస్ఐగా చాంద్రాయణగుట్ట రెండవ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి అవార్డును అందించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నీమచ్ జిల్లాలో అవార్డును అందుకున్నారు.

అసత్య ప్రచారాలు సరికాదు

మన్ననూర్: ఈనెల 14వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాశన్న యాదవ్ ఏ మతాన్ని ఏ కులాన్ని కించపరిచే విధంగా మాట్లాడలేదని యురేనియం వ్యతిరేక జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కల్ముల నాసరయ్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భగవద్గీత కన్నా రాజ్యాంగం గొప్పదని అన్నారని కొందరు మతోన్మాదులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. నిరాధార ఆరోపణలు చేయడం సరి కాదని పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బొందలపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పనులను ఏడాదికి 200 రోజులు పని దినాలను కల్పించాలని దినసరి కూలి రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలికుంటు నివారణ టీకాలు



సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా పశు వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. వెల్దండ మండలంలోని తిమ్మినోనిపల్లి, బుడ్డోనిపల్లి, పెద్దకొత్త మండలంలోని దేవనితిర్మాలాపూర్‌లో అదేవిధంగా జూపల్లి, చారకొండలో, తాడూరు, పదర మండల కేంద్రాల్లో పశువులకు టీకాలు పశు వైద్యాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారులు శ్యామ్‌సుందర్, అనూషా, శివకుమార్, ప్రవీణ్, మద్దెల పల్లవి, డాక్టర్ డీవీ రాజు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి

బిజినేపల్లి: పంచాయతీ ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సమస్య, విద్యుత్తు సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వివరించారు. జి.అశోక్, మహిమూద్, పరశురాం, రమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో గాయాలు

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లిలో గురువారం పెద్ద తేనెటీగలు దాడిలో నలుగురికి గాయాలైన ఘటన చోటుచేసుకుంది. కంటం వెంకటేష్ పొలంలో భార్య వాణి, తండ్రి యాదయ్య, కుమారుడు రుద్రాంసలతో కలిసి పనులు చేస్తున్నాడు. ఒక్కసారిగా పెద్ద తేనెటీగలు వారిపై దాడిచేయడంతో పరుగులు తీశారు. గమనించిన చుట్టపక్కల వారిని రక్షించారు. చికిత్స నిమిత్తం వెల్దండ ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఘనంగా ఉత్సవ విగ్రహాల చక్రతీర్థం

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం 'చక్రతీర్థం' పల్లకీ సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామచంద్రస్వామి సమేత లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను పల్లకీ ఉంచి ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామాచారి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

